సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

I

బుధవారం । 1 । మే । 2024

రేగొండలో జరిగిన జన జాతర సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, హాజరైన జనం




జనంతో సాగిన జాతర

రేగొండ కాంగ్రెస్ సభకు భారీగా తరలి వచ్చిన జనం

- కిక్కిరిసిన భూపాలపల్లి- పరకాల జాతీయ రహదారి
- పార్టీ శ్రేణుల్లో మరింత జోష్
- కావ్యకు 2 లక్షల మెజార్టీ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు



రాష్ట్రానికి బీజేపీ ఏమీ ఇవ్వలేదని సభా వేదిక వద్ద వ్యంగ్యంగా ఏర్పాటు చేసిన గుడ్డు ఆకృతి

భూపాలపల్లి/రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జన జాతర బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పోటెత్తారు. భూపాలపల్లి నియోజకవర్గం నుంచి సుమారు 70వేల మందికిపైగా ప్రజలు హాజరయ్యారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా.. నేతల రాక ఆలస్యం కారణంగా 4.30 గంటలకు ప్రారంభమైంది. జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రసంగించాక సీఎం రేవంత్‌రెడ్డి 5.29 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుని చేసిన ప్రసంగం కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత ఉత్తేజాన్ని నింపింది. సభకు వచ్చిన ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించారు. సరిపడా టెంట్లు వేసి తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించడంతో ఎవరూ ఇబ్బంది పడలేదు.

సీఎం టూర్ సాగిందిలా..

టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా జమ్మికుంట నుంచి రేగొండ మండల కేంద్రానికి వచ్చారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకు సభకు హాజరు కావాల్సి ఉండగా.. సాయంత్రం 5.05 గంటలకు హెలికాప్టర్ సభా ప్రాంగణం సమీపానికి చేరుకుంది. 5.10 గంటలకు సీఎం వేదిక పైకి ఎక్కి ప్రజలకు అభివాదం తెలిపారు. సీఎం రాకముందే ఎమ్మెల్యేలు ప్రసంగించగా.. సీఎం వచ్చాక మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య మాత్రమే ప్రసంగించారు. అనంతరం 5.29 గంటలకు రేవంత్‌రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించి 5.48 గంటలకు ముగించారు. 5.53 గంటలకు రేగొండ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. జన జాతర సభలో ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీపీఐ, సీపీఎం నాయకులు చాడా వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, అయిత ప్రకాశ్‌రెడ్డి, గాజర్ల అశోక్(ఐతు), పిల్లలమర్రి నారాయణ, కర్ణాకర్ పాల్గొన్నారు.

> **వరంగల్ అభివృద్ధి బాధ్యత నాది..**
>
> ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత నాది. భూపాలపల్లి నియోజకవర్గంలోని డీబీఎం 38 కాలువకు నీరు వచ్చేలా చూసి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తా. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యకు 2 లక్షల మెజార్టీ ఇవ్వాలి. జయశంకర్ సార్ సొంత గ్రామమైన అక్కంపేటను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదు. మేం అధికారంలోకి వచ్చాక తొలిరోజే రెవెన్యూ గ్రామంగా ప్రకటించాం. బీఆర్ఎస్‌కు ఒక్క ఓటు వేసినా అది మురిగిపోతుంది. కారు కార్ఖానాకు పోయింది. ఇక దాన్ని జుమ్మేరాత్ బజార్‌లో తూకానికి అమ్మాల్సిందే. వరంగల్‌కు ఔటర్ రింగ్ రోడ్డు రాలేదు. రావాల్సిన ఎయిర్‌పోర్టును మోదీ అడ్డుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో కాంగ్రెస్ కార్యకర్తల బాధ్యత తీరలేదు. ఫైనల్స్ అయిన ఈ ఎంపీ ఎన్నికల్లో గెలిపించాలి. - సీఎం రేవంత్‌రెడ్డి

మానుకోటకు నేడు కేసీఆర్

- సాయంత్రం రోడ్‌షోలో పాల్గొననున్న బీఆర్ఎస్ అధినేత



మహబూబాబాద్: బస్సుయాత్రలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షో జరగనుంది. ఇల్లెందు రోడ్డులోని ధరణి ఆస్పత్రి ఎదుట నుంచి ఆర్‌టీబీ, అండర్ బ్రిడ్జి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి రోడ్డు, నెహ్రూసెంటర్ మీదుగా ఇందిరాగాంధీ సెంటర్ వరకు రోడ్‌షో జరగనుంది. ఇందిరాగాంధీ సెంటర్‌లో జరిగే కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగిస్తారు. మాజీ సీఎంగా మొదటిసారి మానుకోట వస్తున్న కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్నర్ మీటింగ్ ముగిసిన అనంతరం హనుమకొండకు వెళ్లి అక్కడే బస చేయనున్నట్లు నాయకులు తెలిపారు. రోడ్‌షో, కార్నర్ మీటింగ్ ఏర్పాట్లను మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌తోపాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పరిశీలించారు.

బాలికలదే పైచేయి

- హనుమకొండలో 95.99శాతం ఉత్తీర్ణత.. రాష్ట్రస్థాయిలో పదో స్థానం
- వరంగల్‌లో 92.20శాతం.. 22వ స్థానంలో నిలిచిన జిల్లా
- రెండు జిల్లాల్లో కలిపి 425 మంది విద్యార్థులకు పది జీపీఏ
- గతేడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలు

- వివరాలు IIలో

1,900 పోలింగ్ కేంద్రాలు.. 5,700 ఈవీఎంలు

వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

సాక్షి, వరంగల్ : 'వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి 42 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి మూడు ఈవీఎంలు కావాలి. 1,900 పోలింగ్ కేంద్రాల్లో 5,700 ఈవీఎంలు అవసరం. ఈసీ అనుమతితో అదనపు ఈవీఎంలు తెప్పిస్తున్నాం. ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. వరంగల్ కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు.

18,24,466 మంది ఓటర్లు..

పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 18,24,466 మంది ఓటర్లు, 1,026 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని ప్రావీణ్య తెలిపారు. ఈనెల 8లోగా ఓటరు స్లిప్పులు పంపిణీ చేసేలా జిల్లాస్థాయి అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.1,46,86,025 నగదు, రూ.11,13,976 విలువైన బంగారం, వెండి వస్తువులు, రూ.28,94,090 విలువైన పీడీఎస్ బియ్యం, రూ.3,78,04,981 విలువైన మద్యం రూ.68,32,000 విలువైన 270 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆమె చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన 385 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వెల్లడించారు. ఏనుమాముల మార్కెట్ యార్డులోని 17, 18, 19 నంబర్ల గోడౌన్లలో జూన్ 3న నిర్వహించే కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌కు 8,685 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించి మొదటి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. సీపీ అంబర్‌కిశోర్‌ఝా మాట్లాడుతూ.. పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సహాయ ఆర్‌ఓ, డీఆర్‌ఓ శ్రీనివాస్, డీపీఆర్‌ఓ అయూబ్‌అలీ, ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వన్నారాయణ పాల్గొన్నారు.

నేడు ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ అసెస్‌మెంట్ ద్వారా బుధవారం బాక్సింగ్, అథ్లెటిక్స్‌లో క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి భారత్‌కు ప్రాతినిధ్యం వహించేలా వారిని తయారు చేయడమే ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. 9 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని, పూర్తి వివరాల కోసం డీఎస్ఏ అథ్లెట్ కోచ్ శ్రీమన్నారాయణను 94410 86556 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎంజీఎం ఏడీ సరెండర్

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎంజీఎం ఆస్పత్రి పరిపాలన అధికారి(అసిస్టెంట్ డైరెక్టర్)ని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ.. సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- వివరాలు IIలో

నిట్ ఉద్యోగి ఆత్మహత్య


హిమాన్షు(ఫైల్)

కాశిబుగ్గ : దంపతుల మధ్య జరిగిన గొడవతో మనస్తాపం చెందిన 'నిట్' ఉద్యోగి (భర్త) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య శాయంపేట రైల్వే గేట్ సమీపంలో జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్ మోదీనగర్‌కు చెందిన హిమాన్షు గుప్తా(33) భార్యతో కలిసి హనుమకొండ జిల్లా కాజీపేట ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటూ నిట్ వరంగల్‌లో జూనియర్ సివిల్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 15 రోజుల క్రితం కూడా జరగడంతో ఇద్దరి తల్లిదండ్రులు సర్ది చెప్పి కలిసి ఉండాలన్నారు. సోమవారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన హిమాన్షు మంగళవారం ఉదయం శాయంపేట సమీపంలో రైల్వే ట్రాక్‌పై గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ట్రాక్ పక్కన ఉన్న బైక్ ఆధారంగా మృతుడి కుటుంబీకులకు జీఆర్పీ సిబ్బంది సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ రాజు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని సీఐ నరేష్ తెలిపారు.

వడదెబ్బతో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి మృతి


నవీన్ (ఫైల్)

హసన్‌పర్తి: వడదెబ్బతో 55వ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగాల నవీన్ (29) మృతి చెందారు. సోమవారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లిన నవీన్ మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో భీమారంలోని తన ఇంటికి వచ్చి అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబీకులు వెంటనే నవీన్‌ను ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా, నవీన్ మృతదేహాన్ని మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. అలాగే, నవీన్ మృతదేహాన్ని బీఆర్ఎస్ నాయకులు ఎస్.విక్టర్‌బాబు, చింతల లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ఖిలా వరంగల్ : రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు వెంటనే పరిహారం చెల్లించాలని భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. గవిచర్ల క్రాస్ నుంచి పడమర, తూర్పుకోట మీదుగా ధర్మారం రైల్వేగేట్ వరకు కొనసాగుతున్న రింగ్ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఖిలా వరంగల్ భూనిర్వాసితులు అడ్డుకున్నారు. పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని నినాదాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, ఎస్సై గోవర్ధన్.. సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. సాయంత్రం వారి వ్యక్తి గత పూచీకత్తిపై విడుదల చేశారు. బజ్జూరి ప్రసాద్, ప్రభాకర్, పోశాల శ్రీనివాస్, పానకల్లు శ్రీనివాస్, పోశాల రవి, హరిబాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎంజీఎం ఏడీ సరెండర్

ఎంజీఎం: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎంజీఎం ఆస్పత్రి పరిపాలన అధికారి (అసిస్టెంట్ డైరెక్టర్) లక్ష్మీరాజ్యంను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ.. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీరాజ్యం 13 ఏళ్లుగా ఎంజీఎంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల కొత్తగా నియమితులైన స్టాఫ్ నర్సులకు ఎంప్లాయ్ ఐడీ, తదితర పత్రాలు సకాలంలో జారీ చేయకపోవడంతో జీతాలు నిలిచిపోయాయి. ఇందుకు ఏడీని బాధ్యుడిగా చేస్తూ.. ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు సమాచారం. ఎంజీఎంలోని పారామెడికల్ ఉద్యోగుల సర్వీస్ పుస్తకాలు కూడా సకాలంలో అప్‌డేట్ చేయడం లేదనే ఆరోపణలున్నాయి. పలువురు మినిస్ట్రీరియల్ సిబ్బంది అంతర్గత బదిలీల విషయాన్ని కూడా లీక్ చేసి సెక్షన్లు మారకుండా ఉద్యోగులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈపరిణామాల నేపథ్యంలో ఏడీని సరెండర్ చేసినట్లు తెలుస్తోంది.



బాలికలదే పైచేయి

హనుమకొండ జిల్లాలో టెన్త్ పరీక్షల్లో 95.99 శాతం ఉత్తీర్ణత

- గతేడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలు

విద్యారణ్యపురి: టెన్త్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. హనుమకొండ జిల్లాలో బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉంది. జిల్లాలో 95.99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అన్ని యాజమాన్యాలు కలిపి 314 పాఠశాలల్లో 12,020 మంది పరీక్షలకు హాజరవగా.. వారిలో 11,538 మంది విద్యార్థులు ఉత్తీర్ణత (95.99శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 6,395 మంది పరీక్షలకు హాజరుకాగా 6,074 మంది ఉత్తీర్ణత (94.98శాతం) సాధించారు. బాలికలు 5,625 మంది పరీక్షలు రాయగా 5,464 మంది (97.10శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు.


హారిక


మీనాక్షి

కాగా.. గతేడాది 91.05 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈసారి 4.94 శాతం పెరిగింది.

ప్రభుత్వ పాఠశాలల్లో 84.17 శాతం

హనుమకొండ జిల్లాలో 10 ప్రభుత్వ పాఠశాలల్లో 796 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. వారిలో 670 మంది (84.17 శాతం) ఉత్తీర్ణత సాధించారు. జెడ్పీ హైస్కూళ్లు 101 ఉండగా.. 2,008 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 1,835 మంది ఉత్తీర్ణత (91.38 శాతం) సాధించారు. ఎయిడెడ్ హైస్కూళ్లు రెండు ఉండగా.. 171 మందికిగాను 168 మంది ఉత్తీర్ణత (98.25 శాతం) సాధించారు.

జిల్లాలో ఇలా..

- మూడు మోడల్ స్కూళ్లలో 263 మంది విద్యార్థులకుగాను 244 మంది ఉత్తీర్ణత (92.78శాతం) సాధించారు.
- జిల్లాలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) 9 ఉన్నాయి. అందులో 379 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా.. వారిలో 360 మంది ఉత్తీర్ణత (94.99శాతం) సాధించారు.
- టీఎస్ఆర్ఈఐఎస్ మూడు ఉండగా.. 207 మంది విద్యార్థులకుగాను 207 మంది విద్యార్థులు (100 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు 9 ఉండగా.. అందులో 611 మంది పరీక్షలు రాశారు. వారిలో 598 మంది (97.87 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- టీటీడబ్ల్యూ ఆర్ఐఈఎస్ ఒకటి ఉండగా.. అందులో 80 మంది విద్యార్థులకుగాను 80 మంది ఉత్తీర్ణత (100 శాతం) సాధించారు.
- మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాలు 8 ఉండగా.. అందులో 628 మంది విద్యార్థులకుగాను 623 మంది విద్యార్థులు ఉత్తీర్ణత (99.20 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- మైనార్టీ గురుకులాలు 5 ఉండగా.. 362 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 348 మంది ఉత్తీర్ణత (96.13 శాతం) సాధించారు.
- ఆశ్రమ పాఠశాలలు రెండు ఉండగా.. అందులో 34 మంది విద్యార్థులకుగాను 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణత (70.59 శాతం) సాధించారు.
- జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు 153 ఉండగా.. అందులో 6,481 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 6,381 మంది (98.46 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- కాజీపేట గర్ల్స్ బీసీ గురుకులంలో ఇద్దరికి 10/10 జీపీఏ వచ్చింది.
- హనుమకొండ జిల్లాలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులం, కాజీపేట గర్ల్స్‌లో ఇద్దరికి 10/10 జీపీఏ సాధించినట్లు ఆ గురుకులం ప్రిన్సిపాల్ సోమయాజులు తెలిపారు. కె.హారిక 10/10 జీపీఏ, ఆర్.మీనాక్షి 10/10 జీపీఏ సాధించినట్లు తెలిపారు.

పదిలో పది..

- టెన్త్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లాది పదో స్థానం
- 345 మంది విద్యార్థులకు 10/10 జీపీఏ

విద్యారణ్యపురి: టెన్త్ పరీక్షల ఫలితాల్లో హనుమకొండ జిల్లా రాష్ట్ర స్థాయిలో పదో స్థానంలో నిలిచింది. ఈసారి 345 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించినట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఏసీజీఈ చలపతిరావు తెలిపారు. టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్‌లో ఏడుగురికి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ముగ్గురికి, టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ వెల్ఫేర్‌లో 1, మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులంలో ఆరుగురికి, మైనార్టీ గురుకులంలో ముగ్గురికి ప్రైవేట్ పాఠశాలలో 325 మందికి మొత్తం 345 మంది 10/10 జీపీఏ సాధించారు. గతేడాది జిల్లాలో 394 మంది 10 జీపీఏలు సాధించగా.. ఈసారి 10 తగ్గాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీలు, మోడల్‌స్కూళ్ల విద్యార్థులు 10 జీపీఏలు సాధించలేకపోయారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈఓ అబ్దుల్‌హై, పక్కన ఏసీజీఈ చలపతిరావు

482 మంది ఫెయిల్

హనుమకొండ జిల్లాలో 482 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. సబ్జెక్టుల వారీగా ఫస్ట్ లాంగ్వేజ్‌లో 180 మంది, సెకండ్ లాంగ్వేజ్‌లో ఒకరు, థర్డ్ లాంగ్వేజ్‌లో 184 మంది, మ్యాథ్స్‌లో 117 మంది, సైన్స్‌లో 90 మంది, సోషల్‌లో 49 మంది ఫెయిల్ అయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈఓ

కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాను డీఈఓ ఎండీ అబ్దుల్ హై వేర్వేరుగా కలిశారు. జిల్లాలో 95.99 శాతం ఉత్తీర్ణత రావడంపై వారు డీఈఓను అభినందించారు. ఆయన వెంట ఏసీజీఈ చలపతిరావు ఉన్నారు.

పది ఫలితాల్లో వరంగల్ జిల్లాకు 22వ స్థానం

- 9,445 మందికి 8,708 మంది ఉత్తీర్ణత
- 93.32 శాతం ఉత్తీర్ణతతో బాలికలు ముందంజ

కాశీబుగ్గ సెంటర్ : వరంగల్ జిల్లాలో పదో తరగతిలో 9,445 మందికి 8,708 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 92.20 శాతం ఉత్తీర్ణతతో జిల్లాకు 22వ స్థానం దక్కింది. 4,832 మంది బాలురకు 4,403 మంది, 4,613 మంది బాలికలకు 4,305 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 93.32 శాతం ఉత్తీర్ణత సాధించి ముందంజలో ఉన్నారు. గత సంవత్సరం 89.61 శాతం ఉత్తీర్ణత సాధిస్తే.. ఈసారి 92.20 శాతం నమోదైంది. జిల్లాలోని 76 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో 18 జెడ్పీ స్కూల్స్, 1 కేజీబీవీ, 1 ఎంజేపీ గురుకుల పాఠశాల, 1 మోడల్ స్కూల్, 1 సాంఘిక గురుకుల పాఠశాల, 54 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. 80 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. 14 మంది విద్యార్థులు ప్రభుత్వ, 66 మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉన్నారు.

బీజేపీ అరాచకాలకు కాంగ్రెస్‌తోనే బ్రేక్

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య


మాట్లాడుతున్న నాగయ్య

న్యూశాయంపేట: దేశంలోని అరాచకాలను అరికట్టాలంటే కేంద్రంలోని బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా హనుమకొండ హంటర్ రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో సీపీఎం పార్లమెంటరీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. బీజేపీ.. రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ప్రజాసామ్యం బతికి బట్టకట్టాలంటే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే వాటిని తీసేయిస్తున్నారని, గుడిసెలపై చేయి వేయకుండా అడ్డుకునే బాధ్యత తనదన్నారు. గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలిప్పిస్తానని హామీ ఇచ్చారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. గుడిసె వాసులకు పట్టాలిప్పించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు రంగయ్య, చక్రపాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర నాయకులు పి.సుదర్శన్, ఎండీ.అబ్బాస్, వెంకటేష్, జిల్లా నాయకులు కనకారెడ్డి, వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జడ్జి కృష్ణమూర్తికి వీడ్కోలు


జడ్జి దంపతులను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పని చేసి పదవీ విరమణ పొందిన జడ్జి యం.కృష్ణమూర్తిని మంగళవారం ఉభయ జిల్లాల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. జడ్జి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. 40 ఏళ్ల క్రితం న్యాయశాఖలో ఉద్యోగిగా ప్రస్థానాన్ని ప్రారంభించి జూనియర్ సివిల్ జడ్జి నుంచి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఎదిగానని, ఈ ప్రయాణంలో ఉద్యోగుల, న్యాయవాదుల, ముఖ్యంగా తన జీవిత సహచరణి సహకారం మరువలేనిదన్నారు. వరంగల్‌తో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, ప్రధాన న్యాయమూర్తిగా సంతృప్తిగా విధులు నిర్వహించానన్నారు. వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబ, హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, రమేష్, జీవన్‌గౌడ్, అహ్మద్, బార్ కౌన్సిల్ సభ్యులు జనార్దన్, జయాకర్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

భద్రకాళీ అమ్మవారికి పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళీ దేవాలయంలో మంగళవారం హనుమకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, ఇన్‌కమ్‌టాక్స్ అప్పిలేట్ జడ్జి నరసింహచార్యులు పూజలు నిర్వహించారు. అర్చకులు మహదాశీర్వచనం అందించారు. దేవాలయ ఈఓ శేషభారతి వారికి అమ్మవారి శేషవస్త్రాలు అందజేశారు.

హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్: కేరళ కొట్టాయంలోని ఎండీ యూనివర్సిటీలో మే 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ హ్యాండ్ బాల్ పురుషుల కేయూ జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకయ్య మంగళవారం తెలిపారు. ఈజట్టులో సాయికుమార్,(ఎల్‌బీ కాలేజీ వరంగల్), జి.కరుణాకర్, ఎస్.అశోక్ (ఖమ్మంలోని యూనివర్సిటీ వ్యాయామ కళాశాల), వెంకటేష్, డి.శ్రీనివాస్ (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, హనుమకొండ), ఎస్.అరవింద్ (యూనివర్సిటీ కాలేజీ), సీహెచ్ ఉపేంద్ర, పి.సాయితేజ (ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్, ఖమ్మం), మహ్మద్ గౌస్ పాషా (న్యూసైన్స్ డిగ్రీ కళాశాల, హనుమకొండ), బి.సంతోశ్(ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మంచిర్యాల), టి.అజయ్ (సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ వరంగల్), పి.సిద్దు (విశ్వవిద్యాలయం వ్యాయామ కళాశాల, వరంగల్) ఉన్నారు. ఈజట్టుకు మేనేజర్‌గా ఖమ్మంలోని వ్యాయామ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రావు వ్యవహరిస్తారు. ఈజట్టును మంగళవారం కేయూలో వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకయ్య అభినందించారు.

విద్యుత్ ప్రమాదాలు జీరో స్థాయికి తీసుకురావాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ ప్రమాదాలు జీరో స్థాయికి తీసుకురావాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మే 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలు, భద్రత సూక్తులు తెలిపే బుక్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిల్ (జిల్లా)ల్లో మే 1 నుంచి 7 వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించి ప్రజల్లో విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. నోడల్ అధికారులు ప్రతి డివిజన్, సబ్ డివిజన్‌లో విద్యుత్ భద్రత ప్రాముఖ్యత వివరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, వి.మోహన్ రావు, టి.సదర్ లాల్, వి. తిరుపతి రెడ్డి, సీజీఎంలు టి.మధుసూదన్, కె.ఎన్.గుట్ట, సి.ప్రభాకర్, కిషన్, రాజుచౌహాన్, అశోక్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ కె.రమేష్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో అత్యుత్తమ ఫలితాలు..

- ఉమ్మడి జిల్లాలో 16 గురుకులాల్లో వందశాతం ఉత్తీర్ణత
- 35మంది విద్యార్థులకు 10/10 జీపీఏ

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాలు టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. కాజీపేట గర్ల్స్, మొండ్రాయి(జి), పాకాల కొత్తగూడ(జి), శ్యాయంపేట(బి), దంతాలపల్లి (బి), గుమ్మడూరు (జి), బచ్చన్నపేట(జి), నల్లబెల్లి (బి), బచ్చన్నపేట (జి)స్టేషన్‌ఘన్‌పూర్(బి), పెద్దాపూర్(జి), భూపాలపల్లి (బి) తిమ్మాపూర్ (జి), భూపాలపల్లి (బి), వెంకటాపూర్ (బి),ఐనవోలు (బి) గురుకులాల్లో వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. కమలాపూర్ (జి) ఖిలావరంగల్ (జి) , మొగుళ్లపల్లి (జి) , వరంగల్ (జి) , సంగెం (బి), గుమ్మడూరు (బి) రఘునాథపల్లి (జి), హనుమకొండ (బి), వర్ధన్నపేట (జి), నెక్కొండ(జి), మరిపెడ (జి), పెద్ద వంగర, (బి), కమలాపూర్ (బి) గురుకులాలు కలిపి మొత్తం 2,184మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 2,165 మంది (99.1శాతం)ఉత్తీర్ణత సాధించారని బీసీ గురుకులాల ఉమ్మడి వరంగల్‌జిల్లా ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆయా గురుకులాల్లో 35 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. 9.8 జీపీఏ 84 మంది, 9.7 జీపీఏ 121 మంది, 9.5 168 మంది, 9.3 జీపీఏ 180మంది, 9.2 జీపీఏ 197 మంది సాధించారని ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో 'ఎస్ఆర్' విజయదుందుభి


విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి తదితరులు

- 124మంది విద్యార్థులకు 10/10 జీపీఏ

విద్యారణ్యపురి: టెన్త్ పరీక్షల ఫలితాల్లో ఈసారి కూడా జిల్లాలో, రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తూ ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయదుందుభి మోగించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. టెన్త్ పరీక్షల ఫలితాల్లో 124మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారని తెలిపారు. క్రమశిక్షణతోకూడిన విద్య, పటిష్ట పాఠ్యప్రణాళికతో అంకితభావం కలిగిన ఉపాధ్యాయ బృందం ఈ విజయానికి కారణ మన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని ఆచరణ పరుస్తూ ఒత్తిడిలేని వాతావరణంలో క్రమశిక్షణ, సృజనాత్మకతతో కూడిన విద్యనందిస్తున్నామన్నారు. ఎస్ఆర్ విద్యాసంస్థల్లో పోటీపరీక్షలు ఎదుర్కొనేలా పదో విద్యార్థులకు ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌లో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులను అన్ని పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు బృహత్తర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రైమ్ స్కూల్స్ ప్రారంభించామన్నారు. టెన్త్ ఫలితాల్లో అఖండ విజయం సాధించిన విద్యార్థులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందానికి వారు శుభాకాంక్షలు తెలిపారు.

'షైన్' విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు

హన్మకొండ: పదో ఫలితాల్లో హనుమకొండలోని షైన్ హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కార్పొరేట్ విద్యా సంస్థలను తలదన్నేలా తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకే తలమానికంగా నిలిచారని షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ తెలిపారు. పది జీపీఏ సాధించడంలో షైన్ ఎప్పుడూ అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. జిల్లాలోనే అత్యధికంగా 40 మంది 10 జీపీఏ సాధించారని, 56 మంది 9.8, 50 మంది 9.7, 56 మంది 9.5, 43 మంది 9.3, 55 మంది 9.2 జీపీఏ సాధించి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచారని వివరించారు. తెలుగులో 222, హిందీలో 166, ఇంగ్లిష్‌లో 125, గణితంలో 265, సైన్స్‌లో 248, సోషల్‌లో 213 మంది 10 జీపీఏ సాధించారని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో అత్యుత్తమ బోధన అందించడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. ఈ సందర్భంగా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను షైన్ యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో డైరెక్టర్ పి.రాజేంద్రకుమార్, ఐఐటీ కోఆర్డినేటర్ మూగల రమేష్, షైన్ ఎర్రగట్టు చైర్మన్ జె.శ్రీనివాస్, ప్రిన్సిపాళ్లు బి.రాజ్‌కుమార్, బి.సంపత్, పి.విశాల్, కవితా రాణి, దినేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిస్నీల్యాండ్ విద్యార్థుల హవా


మట్ట ప్రణీత్


భూమ యశ్వంత్


జాడి భవ్య


మిట్టపల్లి శ్రీకాంత్

దామెర: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ టెక్నో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించినట్లు పాఠశాల కరస్పాండెంట్ డి. శోభారాణి మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన మట్ట ప్రణీత్‌యాదవ్, భూమ యశ్వంత్, మిట్టపల్లి శ్రీకాంత్, జాడి భవ్య 10 జీపీఏ సాధించారు. అదే విధంగా 6 విద్యార్థులు 9.8, 10 మంది 9.7, 11 మంది 9.5, 8 మంది 9.3, 16 మంది 9.2, 12 మంది 9 జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ముఖ్య సలహాదారులు డి. మల్లయ్య, సదయ్య, బాలుగ లక్ష్మీనివాసం, డైరెక్టర్లు రాకేష్‌భాను, దినేష్‌చందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

తేజస్వి పాఠశాల విజయకేతనం


గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులతో తేజస్వి పాఠశాల చైర్మన్ రేపూరి జెన్నారెడ్డి

నయీంనగర్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తేజస్వి పాఠశాల విజయకేతనం ఎగురవేసింది. 104 మంది విద్యార్థులు పది గ్రేడ్ పాయింట్స్ సాధించారు. నయీంనగర్, పోచమ్మకుంట, ప్రశాంత్‌నగర్ బ్రాంచ్‌ల విద్యార్థులు 10 గ్రేడ్ పాయింట్స్ సాధించారు. పాఠశాల గత చరిత్రను కొనసాగిస్తూ మొదటి స్థానాన్ని నిలబెట్టుకుంది. సంవత్సరాలు మారినా, విద్యార్థులు మారినా విజయపరంపర కొనసాగించడం తేజస్వి లక్ష్యమని పాఠశాల చైర్మన్ రేపూరి జెన్నారెడ్డి అన్నారు. ఈ విజయ పరంపర కొనసాగించిన విద్యార్థులు, వారికి సహకరించిన బోధన సిబ్బంది, తల్లిదండ్రులకు ఆర్ జెన్నారెడ్డి, పిల్లలమర్రి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ జేపీ రావు, సంధ్య, సహజ అభినందనలు తెలిపారు. గ్రేడ్ వివరాలు 10 గ్రేడ్- 104, 9.8-77, 9.7-61, 9.5-35, 9.3-37, 9.2 -37, 9-23, 9-118 మంది విద్యార్థులు సాధించారు.

శ్రీచైతన్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం

హన్మకొండ: పదో తరగతి ఫలితాల్లో హనుమకొండలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 47 మంది విద్యార్థులు 10 జీపీఏ, 26 మంది 9.8, 15 మంది 9.7, 100 మంది 9.5, 115 మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించారని శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. విద్యార్థులు ఐఐటీ, మెడికల్‌తో పాటు స్టేట్ సిలబస్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. అత్యుత్తమ విద్యాబోధనతో ఈ ఫలితాలు సాధించామన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీవిద్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాని విద్యాసంస్థల విజయభేరి


అక్షయ


నిచిత


సంజన

హసన్‌పర్తి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శివాని విద్యాసంస్థలు విజయభేరి మోగించాయి. పాఠశాల విద్యార్థినులు అల్వాల అక్షయ (9.8జీపీఏ), ఎ.నిచిత(9.8జీపీఏ), పొన్నోజు సంజన (9.8 జీపీఏ),ఉప్పుల సాయినాథ్ (9.7జీపీఏ),తాళ్లపల్లి శ్రీసాయి హిమావరి(9.7జీపీఏ),ఎం.మేఘన(9.7 జీపీఏ),జి. రష్మిక(9.7 జీపీఏ) సాధించినట్లు శివాని విద్యాసంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి తెలిపారు. పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, టి.రాజు, రమేష్, మురళీధర్, వి.సురేష్, సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
ఫ్యామిలీ
వరంగల్
బుధవారం ॥ 1-5-2024



ప్రతి శ్రమకూ ఒక విలువ ఉంటుంది.
పురుషుడు విలువ కలిగిన శ్రమే చేస్తాడు.
అతడిది ఉద్యోగం.
స్త్రీ విలువ కట్టని ఇంటి పని చేస్తుంది.
ఆమెది చాకిరి.
భారతదేశంలో స్త్రీ, పురుషుల్లో స్త్రీలు
అత్యధిక గంటలు ఏ ఖరీదూ లేని
ఇంటి పనుల్లో మునిగి ఉంటున్నారని
సర్వేలు చెబుతున్నాయి.
దేశ యంత్రాంగాలు అంతరాయం
లేకుండా ముందుకు సాగడంలో
ఈ శ్రమ నిశ్శబ్ద పాత్ర వహిస్తోంది.
స్త్రీల శ్రమకు విలువ కట్టలేకపోతే
కనీసం గౌరవం ఇవ్వడమైనా నేర్వాలి.

ఖరీదు కట్టే షరాబు లేదు

ఇంతకు ముందు వివరించి చెప్పడం కొంత కష్టమయ్యేది. ఇప్పుడు అర్బన్ క్లాప్ వంటి సంస్థలు వచ్చాయి కనుక సులువు. అర్బన్ క్లాప్ వారికి బాత్‌రూమ్‌ల క్లీనింగ్ కోసం కాల్ చేస్తే వాళ్లు ఒక్కో బాత్‌రూమ్‌కు ఇంతని చార్జ్ చేస్తారు. ఇంట్లో రెండుంటే రెంటికీ చార్జ్ పడుతుంది. అదీ ఒకసారికి. అమ్మ వారంలో రెండు సార్లు, నెలలో ఏడెనిమిది సార్లు రెండు బాత్‌రూమ్‌లు కడుగుతుంది. ఆమెకు ఆ చార్జ్ మొత్తం ఇవ్వాలి లెక్క ప్రకారం. అలాగే కిచెన్ క్లీన్ చేయాలంటే కూడా ఒక చార్జ్ ఉంటుంది. అమ్మ రోజూ వంటిల్లు సర్ది సర్ది, ప్లాట్‌ఫామ్ కడిగి, స్టవ్ రుద్ది క్లీన్ చేస్తుంది. ఆ చార్జ్ కూడా ఆమెకు ఇవ్వాలి. అమ్మ శ్రమకు కనీసం విలువ కట్టాలని కొన్ని సందర్భాలలో కోర్టులు కూడా అంటున్నాయి. కొన్ని సంస్థలు అమ్మ శ్రమను ఎలా విలువ కట్టవచ్చో కూడా చెబుతున్నాయి.

1. ఆపర్చునిటీ కాస్ట్ మెథడ్:
అంటే అమ్మ బయటకు వెళ్లి ఉద్యోగం చేస్తే నలభై వేలు వస్తాయనుకుంటే, ఆమె ఆ ఉద్యోగం మానుకుని ఇంట్లో ఉండిపోతే ఆమె శ్రమ విలువను నెలకు నలభై వేలుగా గుర్తించాలి. (అమ్మ ఉద్యోగం చేసి కూడా అంత శ్రమా చేస్తుంటే నలభైకి మరో నలభై కలిపి ఇంటికి ఇస్తున్నట్టు).

2. రీప్లేస్‌మెంట్ కాస్ట్ మెథడ్:
ఇల్లు చిమ్మడం, బట్టలుతకడం, ఆరిన బట్టల్ని మడత పెట్టడం, ఇస్త్రీ చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, కూరగాయలు, సరుకులు తెచ్చుకోవడం, బిల్లులు కట్టడం, వంట చేయడం, ఇంటిని కనిపెట్టుకుని ఉండటం... వీటన్నింటినీ బయట వ్యక్తులతో సర్వీసుగా తీసుకుంటే (అర్బన్ క్లాప్ మాదిరిగా) ఎంత అవుతుందో లెక్కగట్టి అది అమ్మ చేసే పని శ్రమగా గుర్తించడం.



3. ఇన్‌పుట్/అవుట్‌పుట్ కాస్ట్ మెథడ్:
అలా కాకుండా ఈ పనులన్నింటికీ ఒక యోగ్యమైన ఉద్యోగిని పెట్టుకుంటే మార్కెట్ అంచనాను బట్టి ఎంత జీతం ఇవ్వాల్సి వస్తుందో అంత జీతం ఇవ్వడం.

అవన్నీ సరే. కంటికి కనిపించే పనులకు కట్టే విలువ. కాని పిల్లవాడు స్కూల్లో పడి దెబ్బ తగిలించుకుని ఇంటికి వస్తే అమ్మ దగ్గరకు తీసుకుని, మందు రాసి, ధైర్యం చెప్పి, వాడి పక్కన కూచుని కబుర్లు చెపుతుందే... ఆ ప్రేమకు విలువ కట్టే షరాబు ఉన్నాడా?

మే డే రోజున ప్రపంచ కార్మికురాలా ఏకం కండి అనే నినాదాలు వినిపిస్తుంటాయి. కాని ఇంటి పని చేస్తూ, అది ఎక్కువైనా చేస్తూ, కుటుంబమంతా ఆ పనిలో భాగం కావాలన్న సంగతిని చెప్పడానికి కూడా తటపటాయిస్తూ, అది వద్దనుకుంటే ఆ ఆప్షన్ లేక, తప్పించుకోవడానికి వీల్లేని ఆ పనిని చేస్తూ కూడా విలువ లేని పని చేస్తున్నామన్న న్యూనతను అనుభవిస్తూ తమ హక్కులు ఏమిటో తమకే తెలియని తల్లి, భార్య, కుమార్తె, చెల్లెళ్లను కార్మికులుగా గుర్తించాలని ఎవరూ అనుకోరు.

స్త్రీల ఇంటి శ్రమ దేశంలోని యంత్రాంగం సజావుగా పనిచేయడంలో కీలకమైనది. వారు... 1. దేశం కోసం పని చేసి రిటైరైన వృద్ధుల సేవలో ఉంటారు. 2. దేశానికి ఆదాయం తెచ్చిపెట్టే యువత సేవలో ఉంటారు. 3. దేశానికి భవిష్యత్తులో అంది రావాల్సిన పిల్లల సేవలో ఉంటారు.

'కుటుంబం' అనే బంధంలోకి వచ్చి కూతురిగా, కోడలిగా, భార్యగా వీరు 'ప్రేమ'తో, 'బాధ్యత'తో, 'బంధం'తో ఈ సేవ చేస్తారు. అంత మాత్రం చేత ఈ సేవను నిరాకరించడానికి వీల్లేదు. శ్రమగా చూడక్కర్లేదని భావించకూడదు. ఇంత చేస్తున్నా 'ఇంట్లో కూచుని ఏం చేస్తుంటావ్?' అనే మాటను వాళ్లు పడాలా?

ఉద్యోగం చేసినా చేయకపోయినా ఒక గృహిణి రోజుకు సగటున మూడున్నర గంటలు ఇంటి పని చేస్తుంటే పురుషుడు కేవలం గంటన్నర ఇంటి పని చేస్తున్నాడు.

స్త్రీలు తమ ఇంటి పనిని ఒక్కరోజు మానేసి సహాయనిరాకరణ చేస్తే దేశం స్తంభిస్తుంది. అందుకే స్త్రీల శ్రమను గౌరవించే మే డే రోజున వారికి కృతజ్ఞతలు తెలియచేయాలి. విలువైన శ్రమ చేస్తున్నందుకు సమాజం వారికి హర్షధ్వానాలు తెలియచేయాలి.



1. సాచి 2. ఇలీన హ్యాట్స్ 3. అవంతి 4. అనన్య నందా 5. అంకిత కుందు 6. రణిత బెనర్జీ 7. లిష మిశ్రా 8. మిథాలీ ఠాకూర్ 9. దియా వదిరాజ్

సెల్ఫ్-మేడ్ మ్యూజిక్ స్టార్స్

క్షణ క్షణం సంగీత పర్వం

యూత్ పల్స్

యువ సంగీతాభిమానులకు అచ్చంగా సరిపోయే మాట... మ్యూజిక్ మేక్స్ ఎవ్రీ థింగ్ బెటర్. ఇట్టే మరిచిపోయే లక్షణం నుంచి జ్ఞాపకశక్తి పెరగడం వరకు, క్రియేటివిటీని ఎంజాయ్ చేయడం నుంచి క్రియేటివ్ పవర్ పెంచుకోవడం వరకు, జడత్వం నుంచి నిత్యజీవనోత్సాహం వెల్లివిరియడం వరకు, అనామకత్వం నుంచి ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదగడం వరకు ఎన్నోరకాలుగా సంగీతం యువతకు బలం అయింది. సంగీత రత్నాలను వెదుకుతూ మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలోకి అడుగు పెట్టిన యువతరం ఆ ప్లాట్‌ఫామ్‌లలోనే మ్యూజిక్ స్టార్‌లుగా మెరవడం ఈ తరంలో కనిపిస్తున్న ప్రత్యేకత.

ఆరు సంవత్సరాల వయసులో పాటల కోసం గొంతు సవరించింది బెంగళూరుకు చెందిన దియా వదిరాజ్. రకరకాల మ్యూజిక్ జానర్‌లలో టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది. కోల్‌కతాకు చెందిన రనితా బెనర్జీ అయిదు సంవత్సరాల వయసులో 'సింగింగ్ స్టార్' షోలో పాల్గొంది. 'స రే గ మ ప' లిటిల్ ఛాంప్స్‌లో ఫస్ట్ రన్నర్-అప్‌గా నిలిచింది. 'స్వీట్ వాయిస్' రనిత గొంతు నుంచి వచ్చిన 'జరాసీ ఆహట్' పాట 6.2 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

మల్టీ టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది అంకిత కుందు. రియాల్టీ షోలలో పాడడం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బిహార్‌కు చెందిన మిథాలీ ఠాకూర్ 'రైజింగ్ స్టార్' షోతో ఫేమ్ అయింది. భోజ్‌పూరి, క్లాసికల్, ఫోక్ సాంగ్స్‌ను పాడడంలో మంచి పేరు తెచ్చుకుంది. యూట్యూబ్‌లో ఆమె వీడియోలు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇండియన్-అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్ లిశా మిశ్రా పాటలను రికార్డ్ చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. బాలీవుడ్ సినిమాలలో కూడా పాడింది. ఇండియన్ ఐడల్ జూనియర్‌గా 2015లో సంగీత ప్రపంచానికి పరిచయం అయింది భువనేశ్వర్‌కు చెందిన అనన్య నందా. బాలీవుడ్ పాటల్లోనే కాదు క్లాసికల్‌లోనూ మంచి పేరు తెచ్చుకుంది. మెలోడియస్ వాయిస్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.

బోస్టన్ (యూఎస్)లో పుట్టిన అవంతి నగ్రల్‌కు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ముంబైకి వచ్చిన తరువాత తన పాషన్‌నే కెరీర్‌గా చేసుకుంది. మ్యూజిక్‌లో రకరకాల జానర్స్‌ను మిక్స్ చేయడంలో గట్టి పట్టు సాధించిన అవంతికి యూట్యూబ్ చానల్ కూడా ఉంది. ఇందులో తన లైవ్ పర్‌ఫార్‌మెన్స్ వీడియోలను అప్‌లోడ్ చేస్తుంది. అవంతికి ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు.

ఆర్ అండ్ బీ, హిప్-హాప్, సోల్, పాప్ మ్యూజిక్‌లలో బహుముఖ ప్రజ్ఞ చాటుకుంటోంది ఇలీన హ్యాట్స్. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చింది. ముంబైకి చెందిన సాచి రాజాధ్యక్ష ఆల్ట్-పాప్ మ్యూజిక్‌లో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది. ఆమె పవర్‌ఫుల్, సోల్ వాయిస్‌కు ఎంతోమంది అభిమానులు ఉన్నారు.

దియ నుంచి అవంతి వరకు ఎందరో, ఎందరెందరో యంగ్ మ్యూజిషియన్స్ సంగీతం పట్ల అంకితభావంతో సెల్ఫ్-మేడ్ సూపర్‌స్టార్‌లుగా ఎదిగారు. ఎంతోమంది ఔత్సాహికులకు రోల్ మోడల్స్‌గా మారారు.



స్పాటిఫైతో ప్రయాణం ప్రారంభించి స్టార్‌గా ఎదిగిన ఆర్టిస్ట్‌లలో జస్లీన్ రాయల్ ఒకరు. సింగర్, సాంగ్ రైటర్, కంపోజర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. హిట్ బాలీవుడ్ ట్రాక్స్ కంపోజ్ చేసింది. 'ప్రపంచ ప్రేక్షకులతో కనెక్ట్ కావడానికి, శ్రోతల అభిప్రాయాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా మ్యూజిక్ కంపోజింగ్‌లో మార్పులు చేయడానికి స్పాటిఫై ఉపయోగపడింది' అంటుంది జస్లీన్ రాయల్.

సినిమా

- తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం
- రూ. రెండు కోట్లు వసూలు చేసిన తొలి తెలుగు చిత్రం
- జాతీయ అవార్డు తెచ్చుకున్న తొలి తెలుగు పాట 'తెలుగు వీర లేవరా...'
- ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం

అల్లూరికి అర్ధ శతాబ్దం



'మా మన్యం దొర సీతారామరాజు వచ్చాడు'.... ప్రజల్లో సంబరం. దొరకు పాదాభివందనం చేశారు. కానీ... అతను నిజమైన దొర కాదు. మన్యం దొర అల్లూరి సీతారామ రాజు గెటప్ వేసుకున్న నటుడు. అప్పటికి నిజమైన అల్లూరి సీతారామరాజుని చూసిన కొందరు వృద్ధులు లొకేషన్లో ఆ గెటప్‌లో ఉన్న నటుడికి పాదాభివందనం చేశారు. వెండితెరపై సీతారామరాజుగా కనిపించక ముందే అలా షూటింగ్ లొకేషన్లో ప్రజల చేత 'భేష్' అనిపించుకున్నారు కృష్ణ. అల్లూరి సీతారామరాజు గెటప్ అంటే కృష్ణ తప్ప వేరే ఏ నటుడికీ నప్పదు అనేంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు సూపర్ స్టార్. 1974 మే 1న విడుదలైన 'అల్లూరి సీతారామరాజు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రం యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొన్ని విశేషాలు తెలుసుకుందాం...

ఎన్టీఆర్ హీరోగా నటించిన 'అగ్గిరాముడు' సినిమా 1954 ఆగస్టు 5న విడుదలైంది. బుర్రిపాలెంకు చెందిన కృష్ణ తెనాలిలో ఆ సినిమా చూశారు. అందులో అల్లూరి గురించి బుర్రకథగా చెప్పే సీన్ కృష్ణను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'జై సింహ'ని కూడా చూశారు కృష్ణ. ఆ సినిమా పాటల పుస్తకం చివరి పేజీలో ఎన్టీఆర్ తర్వాతి చిత్రం 'అల్లూరి సీతారామరాజు' అనే ప్రకటనతో పాటు అల్లూరి గెటప్‌లో స్కెచ్‌తో గీసిన ఎన్టీఆర్ బొమ్మ ఉంది. ఆ సినిమా కోసం కృష్ణ ఎదురు చూశారు. అయితే ఆ సినిమా ప్రారంభమైనా తర్వాత ఆగిపోయింది. పై చదువుల కోసం ఏలూరు వెళ్లిన కృష్ణకి నాటకాలపై ఆసక్తి కలిగింది. అది కాస్తా సినిమాలవైపు మళ్లడంతో చెన్నైకి చేరుకున్నారు. అప్పుడు ప్రజా నాట్యమండలి రాజారావు బృందం ప్రదర్శించిన 'అల్లూరి సీతారామరాజు' నాటకానికి మంత్రముగ్ధుడయ్యారు కృష్ణ. ఆ తర్వాత హీరో అయిన కృష్ణ 'అసాధ్యుడు'లో (1968) అంతర్నాటకంలో భాగంగా సీతారామరాజు వేషం వేశారు. ఆ వేషంలో చక్కగా ఉన్నారంటూ జనాలు కితాబిచ్చారు. దీంతో తాను హీరోగా అల్లూరి చరిత్రతో సినిమా తీస్తే బాగుంటుందనుకున్నారు కృష్ణ. అయితే 1972లో శోభన్‌బాబు హీరోగా సీతారామరాజు మూవీ నిర్మించనున్నట్లు డి. లక్ష్మీ నారాయణ (డీఎల్) ప్రకటించారు. కానీ అనారోగ్యం వల్ల ఆ ప్రయత్నం విరమించుకున్నారాయన. కృష్ణ హీరోగా 'పెద్దలు మారాలి' సినిమా తీశారు డీఎల్. ఆ చనువుతో సీతారామరాజు కథని కృష్ణకి ఇచ్చి, ఆసక్తి ఉంటే సినిమా తీసుకోమన్నారు. అలా 'అల్లూరి సీతారామరాజు' చేసే అవకాశం కృష్ణకి వచ్చింది.



డేరింగ్ అండ్ డ్యాషింగ్ కృష్ణ

కృష్ణకు 'డేరింగ్ అండ్ డ్యాషింగ్' అని పేరు. 'అల్లూరి సీతారామరాజు' కథలో వాణిజ్యపరమైన అంశాలు ఉండవని, పైగా హీరో చనిపోతాడని ఫైనాన్స్ ఇవ్వడానికి ఫైనాన్షియర్లు, పంపిణీ చేయడానికి కూడా ఎవరూ సాహసించలేదు. 'ఇంత రిస్క్ అవసరమా.. ఈ సినిమా వద్దు' అని శ్రేయోభిలాషులు కృష్ణకు చెప్పారు. ఎన్టీఆర్ కూడా వద్దనే అన్నారు. అయినా తాను ఓ హీరోగా రూపొందిన 'దేవుడు చేసిన మనుషులు' శత దినోత్సవంలో అల్లూరి సీతారామరాజు సినిమా తీస్తున్నానని, అది తన నూరో చిత్రంగా ఉంటుందని కృష్ణ ప్రకటించారు. 1973 డిసెంబరులో మద్రాస్ వాహినీ స్టూడియోలో షూటింగ్ ఆరంభమైంది. అల్లూరి సీతారామరాజు గెటప్‌లో ఉన్న కృష్ణపై ఫస్ట్ షాట్ తీశారు. సినిమా మొదలుపెట్టినప్పట్నుంచి అనేక ఇబ్బందులు. చింతపల్లి అడవిలో షూటింగ్ కాబట్టి అక్కడ గెస్ట్ హౌస్‌లు లేకపోవడంతో యూనిట్‌లోని దాదాపు ఐదువందల మందికి ఒక కాలనీలా తాత్కాలిక బస ఏర్పాటు చేశారు. సముద్ర మట్టానికి నాలుగువేల అడుగుల ఎత్తులో కొండ ప్రాంతంలో షూటింగ్. భయంకరమైన చలి. దాదాపు 40 రోజుల పాటు షూటింగ్ చేశారు. దర్శకుడు రామచంద్రరావు అస్వస్థతకి గురి కావడం ఓ ఊహించని షాక్. ఆయన్ను చెన్నైకి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం చేయించినా కోలుకోలేదు. ఫిబ్రవరి 14న తుది శ్వాస విడిచారు. మిగతా భాగాన్ని కృష్ణ తెరకెక్కించారు. యుద్ధ సన్నివేశాలను దర్శకుడు కేఎస్ఆర్ దాస్ రూపొందించారు. రామచంద్రరావు మీద గౌరవంతో దర్శకుడిగా ఆయన పేరే ఉంచేశారు కృష్ణ.

సినిమా స్కోప్.. ఈజీ కాదు

తెలుగులో పూర్తి స్థాయిలో రూపొందిన తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం 'అల్లూరి సీతారామరాజు'. అయితే అప్పుడు సినిమా స్కోప్ అంత ఈజీ కాదు. ఈ మూవీకి వీఎస్ఆర్ స్వామి ఛాయాగ్రాహకుడు. అప్పట్లో సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసేందుకు రెండే లెన్స్‌లు ఉండేవట. కాగా సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసే లెన్స్‌కి కెమెరా వ్యూఫైండర్స్ ఉండవట. దీంతో ఊహించుకుని ఫ్రేమ్ సెట్ చేసుకునేవారట. ఈ ప్రక్రియను వీఎస్ఆర్ స్వామి ముంబైలో అధ్యయనం చేసి రావడంతో 'అల్లూరి సీతారామరాజు' ఈజీగా చేయగలిగారు.

అల్లూరి చేయనన్న ఎన్టీఆర్
అల్లూరి సీతారామరాజు సినిమా మొదలుపెట్టి, ఆపినా ఆ సినిమా తీయాలన్న ఎన్టీఆర్ ఆకాంక్ష అలాగే ఉండిపోయింది. కృష్ణ 'అల్లూరి సీతారామరాజు' వచ్చిన చాలా ఏళ్లకు ఆ సినిమా తీద్దామని పరుచూరి బ్రదర్స్‌తో అన్నారు ఎన్టీఆర్. కానీ సోదరులు వద్దని సలహా ఇచ్చి, కృష్ణ చేసిన సినిమా చూడమన్నారు. ఎన్టీఆర్ కోరిక మేరకు 'అల్లూరి సీతారామరాజు'ని ప్రత్యేకంగా చూపించారు కృష్ణ. "అద్భుతంగా తీశారు. నేను 'అల్లూరి సీతారామరాజు' తీయను" అన్నారు ఎన్టీఆర్.

మహారథి చేతికి స్క్రిప్ట్
త్రిపురనేని మహారథి చేతిలో డీఎల్ ఇచ్చిన స్క్రిప్ట్ పెట్టి, 'ఈ సబ్జెక్ట్‌లో సినిమా తీయడానికి కావాల్సినంత దమ్ము ఉందా' అడిగారు కృష్ణ సోదరుడు హనుమంతరావు. 'చాలా ఉంది' అన్నారు మహారథి. కానీ, తనకు ఇచ్చిన స్క్రిప్ట్‌లో ఒక్క సన్నివేశం తప్ప మహారథికి వేరే ఏదీ నచ్చలేదు. పరిశోధనలు చేసి, స్క్రిప్ట్ తయారు చేశారు. దర్శకుడిగా వి. రామచంద్రరావును తీసుకున్నారు. సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్‌లో తీయాలని నిర్ణయించింది పద్మాలయా స్టూడియోస్ సంస్థ (కృష్ణ సొంత నిర్మాణ సంస్థ).

'అల్లూరి...' తర్వాత 'పాడి పంటలు'తోనే హిట్... 'అల్లూరి సీతారామరాజు' చూసిన విజయా వాహిని సంస్థ అధినేతల్లో ఒకరైన దర్శక-నిర్మాత చక్రపాణి అభినందించారు. కానీ 'ఈ సినిమా తర్వాత నీ సినిమాలు ఆడటం కష్టం' అని కూడా కృష్ణతో అన్నారు. ఆయన అన్న మాటలు నిజమయ్యాయి. 'అల్లూరి సీతారామరాజు' తర్వాత కృష్ణ చేసిన ప్రతి చిత్రాన్నీ ఈ సినిమాతో పోల్చారు ప్రేక్షకులు. దాంతో ఆ తర్వాత కృష్ణ నటించిన పది సినిమాలకు పైగా ఆశించిన ఫలితాన్ని సాధించలేదు. చివరికి పద్మాలయా స్టూడియోస్ నిర్మించిన 'పాడి పంటలు' (1976) విజయంతో హీరోగా కృష్ణ పూర్వ వైభవాన్ని పొందారు.

అల్లూరి పాటలు అజరామరం

'అల్లూరి సీతారామరాజు'లోని పాటలన్నీ సూపర్ హిట్. పి. ఆదినారాయణరావు ఈ సినిమాకు సంగీత దర్శకుడు. సినిమా ఆరంభంలో వచ్చే 'రగిలింది విప్లవాగ్ని..', సినిమా చివర్లో వచ్చే.. 'ఓ విప్లవజ్యోతి...' పాటలకు ఆరుద్ర సాహిత్యం అందించగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడారు. 'వస్తాడు నా రాజు..' పాటను నారాయణరెడ్డి రాయగా, 'హైలెస్సా.. హైలెస్సా..', 'కొండ దేవతా నిన్ను కొలిచేవమ్మా..' పాటలను కొసరాజు రాశారు. 'తెలుగు వీర లేవరా..' పాటను శ్రీశ్రీ రాశారు. ఈ పాటను ఘంటసాలతోనే పాడించాలన్నది కృష్ణ సంకల్పం. ఆ సమయానికి ఘంటసాల ఆరోగ్యం సరిగా లేదు. ఆ తర్వాత ఘంటసాల ఆరోగ్యం కాస్త కుదుటపడటంతో ఆయన ఈ పాట పాడారు. కానీ ఈ సినిమా విడుదల కాకముందే ఘంటసాల కాలం చేశారు. ఈ పాటకు వి. రామకృష్ణ గొంతు కలిపారు. ఈ పాటకుగాను జాతీయ ఉత్తమ గీత రచయిత అవార్డు శ్రీశ్రీని వరించింది. ఓ తెలుగు సినిమాలోని పాటకు జాతీయ పురస్కారం రావడం అదే తొలిసారి. అలాగే ఇదే సినిమాలోని 'వందేమాతరం అంటూ నినదించిన..', 'హ్యాపీ క్రిస్మస్..' పాట, 'అరుణాయ శరణ్యాయ..' శ్లోకం వంటివి కూడా వీనుల విందుగా ఉంటాయి.

రికార్డులు భళా

'అల్లూరి సీతారామరాజు' సినిమా 19 కేంద్రాల్లో (బెంగళూరుతో కలుపుకుని) వందరోజులు, 2 కేంద్రాల్లో 25 వారాలు, హైదరాబాద్‌లోని సంగం థియేటర్‌లో రజతోత్సవం, అలాగే షిఫ్టింగులతో ఏడాది పాటు ఆడటం విశేషం. ఈ చిత్రం స్వర్ణోత్సవం చెన్నైలోని ఉడ్‌ల్యాండ్స్ హోటల్‌లో ఘనంగా జరిగాయి. స్వాతంత్ర్య సమరయోధులు ఇంటూరి వెంకటేశ్వరరావు, అనిసెట్టి సుబ్బారావు, దాశరథి, సుంకర సత్యనారాయణ, కేఎస్ గోపాలకృష్ణన్ వంటి వారిని సత్కరించారు. అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం రూ. పదివేలతో ఓ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి, అందుకు సంబంధించిన పత్రాలను సీతారామరాజు సోదరుడు సత్యనారాయణరాజుకి అందించారు కృష్ణ. ఇలా ఈ సినిమాకి సంబంధించిన విశేషాలు చాలా ఉన్నాయి.

ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు



● అబ్బూరి రవి

'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా హీరో హీరోయిన్లుగా మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక నిర్మించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ చిత్రం ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం డైలాగ్ రైటర్ అబ్బూరి రవి మాట్లాడుతూ– ''ఈ సినిమాలో పెళ్లి అనే సబ్జెక్ట్‌ను వినోదాత్మకంగా చూపిస్తూనే, ఆడియన్స్ ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యేలా తీశాం. ముఖ్యంగా ఇది పెళ్లి కాని ప్రతి వారు కోరుకునే కంటెంట్. క్లీన్ ఎంటర్‌టైనర్. 'ఆ ఒక్కటీ అడక్కు' అనేది ఈవీవీగారి క్లాసిక్ టైటిల్. ఈ సినిమాకు ఈ టైటిల్‌ను అన్నప్పుడు కాస్త భయం వేసింది. కానీ ఈ కథకు ఆ టైటిల్ సరిగ్గా సరిపోతుందని నరేశ్‌గారే సూచించారు. ఇక నాకు డైరెక్షన్ చేయాలని ఉంది. ఆ ప్రయత్నాల్లో ఉన్నాను. ప్రస్తుతం 'గూఢచారి 2', 'డెకాయిట్' సినిమాలకు వర్క్ చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

ముఫాసా ఈజ్ బ్యాక్



హాలీవుడ్ లయన్ కింగ్ మళ్లీ వస్తున్నాడు. 1994లో వచ్చిన యానిమేటెడ్ మ్యూజికల్ డ్రామా 'ది లయన్ కింగ్' ఆధారంగా 'ది లయన్ కింగ్' టైటిల్‌తోనే సినిమా వచ్చింది. జోన్ ఫావ్రూ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ముఫాసా, సింబ (ముఫాసా తనయుడు), ముఫాసా తమ్ముడు స్కార్‌లు ప్రధాన పాత్రధారులుగా 'ది లయన్ కింగ్' సినిమా కథనం సాగుతుందన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ది లయన్ కింగ్' సినిమాకు ప్రీక్వెల్‌గా 'ముఫాసా: ది లయన్ కింగ్' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ట్రైలర్, ఫస్ట్ లుక్ విడుదలైంది. డిసెంబరు 20న 'ముఫాసా: ది లయన్ కింగ్' రిలీజ్ కానుంది.

వినూత్న కథాంశంతో...


● విరాజ్ అశ్విన్, రవితేజ మహాదాస్యం

రవితేజ మహాదాస్యం హీరోగా మద్దుల మదన్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆర్ట్ మేకర్స్ సమర్పణలో సౌజన్య కావూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రచయిత పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేయగా, తొలి సీన్‌కి విరాజ్ అశ్విన్ క్లాప్ ఇచ్చారు. ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నితిన్ రెడ్డి చిమ్ముల, సహనిర్మాతలు: దియా, సంజీవ్ కోనేరు, వెంకట్ రమణారెడ్డి.

తిండిబోతు దెయ్యం


● నరసింహా, మోనిక, వాసవి

నరసింహా బోదాసు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న కామెడీ హారర్ ఫిల్మ్ 'తిండిబోతు దెయ్యం'. మోనికా సమత్తార్, తన్నీరు వాసవి హీరోయిన్లు. శిరీష నరసింహా బోదాసు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శిరీష నరసింహా బోదాసు కెమెరా స్విచ్చాన్ చేయగా, సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు క్లాప్ ఇచ్చి, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ''ఈ సినిమాలో కొత్తదనం ఉంటుంది'' అన్నారు నరసింహా బోదాసు.